నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 27 జూలై 2024 | NALGONDA

మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది దుష్ప్రచారమే..

- ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నా విడుదల చేసేందుకు నిర్లక్ష్యమెందుకు?
- చేసిన ప్రచారమంతా తప్పని తెలుస్తుందని భయమా?
- రైతాంగాన్ని కన్నీళ్లు పెట్టించిన కాంగ్రెస్‌ది రాక్షసానందం
- పంటలకు వెంటనే నీరందించి.. రైతులకు క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల బృందాలతో మేడిగడ్డ సందర్శన

సూర్యాపేట టౌన్, జూలై 26 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసినదంతా దుష్ప్రచారమేనని.. రైతాంగానికి అందించేందుకు పుష్కలంగా నీళ్లు ఉన్నా ఇంత నిర్లక్ష్యమెందుకని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల బృందంతో కలిసి శుక్రవారం ఆయన మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరంలో పుష్కలంగా నీళ్లున్నా ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందని, ఇప్పుడు నీళ్లు ఇస్తే ఎన్నికల ముందు వాళ్లు చేసిన తప్పుడు ప్రచారమంతా బయటపడుతుందని భయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పంటలు ఎండబెట్టి రైతాంగాన్ని కన్నీళ్లు పెట్టించి రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం వద్ద ప్రస్తుతం 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉందని, గతంలో 28 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అంత ప్రవాహం ఉన్నప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు చెక్కు చెదరలేదని, ఒక్కగేటు కొంత కుంగితేనే కాంగ్రెస్ ఎంతో దుష్ప్రచారం చేసి రైతులను తప్పుదోవ పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వల్ల ఇబ్బంది లేదని ఇంజినీర్లు చెబుతున్నారని, ఇప్పుడు కూడా నీళ్లు ఇచ్చేందుకు సమస్య లేదని అంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయాన్ని ఒప్పుకుంటే ప్రజల్లో అభాసుపాలవుతామనే భయపడుతున్నారని విమర్శించారు. అసలు సూర్యాపేట తదితర జిల్లాలకు నీళ్లు వచ్చే కన్నెపల్లి పంపుహౌజ్ కాళేశ్వరానికి 20 కిలోమీటర్ల పైన ఉన్నదని, అది ఎప్పటికీ నీళ్లను ఎత్తిపోస్తూనే ఉంటుందని తెలిపారు. సుందిళ్ల, అన్నారంలో కొత్తగా ఏమైనా ఇబ్బందులు వస్తాయనే ప్రచారంతో కాంగ్రెస్ రైతాంగాన్ని తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు గేట్లకు మన జిల్లాకు నీళ్లిచ్చే కన్నెపల్లికి నీళ్లు ఎత్తిపోయడానికి సంబంధమే లేదని చెప్పారు. కాళేశ్వరంపై చేసిన దుష్ప్రచారానికి కాంగ్రెస్ రైతాంగానికి క్షమాపణ చెప్పి పంటలకు వెంటనే నీరందించాలని డిమాండ్ చేశారు.

బీబీనగర్ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్స్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

రేషన్ షాపుల వద్ద ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలి

- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
- రాష్ట్ర ఫుడ్స్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బీబీనగర్, జూలై 26 : రేషన్ షాపుల వద్ద ఫిర్యాదు బాక్సు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్స్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కమిషన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత బీబీనగర్ రెండో సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో వంట స్టాక్‌ను, ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఓపీ వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, మాతాశిశు ఆరోగ్యానికి అందిసున్న సేవలను పరిశీలించారు. ఆ తర్వాత రేషన్ షాప్‌ను సందర్శించి స్టాక్ వివరాల బోర్డు ప్రదర్శించాలని, బియ్యం, ఇతర స్టాక్ దెబ్బతినకుండా సరైన విధంగా భద్రపరచాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలను సందర్శించి కిచెన్, డైనింగ్ హాలును పరిశీలించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం కొండమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్‌కి వెళ్లి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన వెంట స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గురుకుల వసతి గృహాల రీజినల్ కోఆర్డినేటర్ రజని, డాక్టర్ శిల్పిని, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నాగార్జునసాగర్ రిజర్వాయర్

శ్రీశైలానికి 2.58 లక్షల ఇన్‌ఫ్లో

- 24 గంటల్లో 6 అడుగులు పెరిగిన నీటిమట్టం
- వరద మరింత పెరుగుతుందని అంచనా
- జల విద్యుత్ కేంద్రాల ద్వారా సాగర్‌కు 6,744 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నాగార్జునసాగర్‌లో 505.50 అడుగుల నీటి మట్టం

నల్లగొండ ప్రతినిధి/నందికొండ, జూలై26(నమస్తే తెలంగాణ) : కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నది. పైనున్న కర్ణాటకలోని ప్రాజెక్టుల గేటన్నీ ఎత్తడంతో శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతున్నది. అంతకంతకూ ప్రవాహం పెరుగుతున్నది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాలతోపాటు తుంగభద్ర డ్యామ్ నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 2.58లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతున్నది. దాంతో గడిచిన 24 గంటల్లోనే ఇంచుమించు 6 అడుగుల మేర శ్రీశైలంలో నీటి మట్టం పెరిగింది. 24 గంటల్లోనే అదనంగా 16.52 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు ఐదు రోజుల కిందటే నిండడంతో గేట్లు ఎత్తిన సంగతి తెలిసిందే. దాంతో ఆ నీరంతా జూరాల ప్రాజెక్టుకు వచ్చి చేరుతున్నది. జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు. ఇంకోవైపు తుంగభద్ర డ్యామ్ సైతం పూర్తి స్థాయిలో నిండడంతో గేట్లు ఎత్తారు. తుంగభద్రలో గరిష్ట నీటి మట్టానికి కొంచెం అటూ ఇటూగా మెయింటెన్ చేస్తూ వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. రెండు ప్రాజెక్టుల నుంచి కలిసి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది.

గతేడాది వరదలను పరిశీలిస్తే ఇదే నెల 27న ఆల్మట్టి గేట్లు ఎత్తారు. ఈసారి పది రోజుల ముందుగానే గేట్లు తెరుచుకోవడంతో దిగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఈ సీజన్‌లో ఇప్పటికే 40 అడుగల మేర నీరు అదనంగా వచ్చి చేరింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2.49 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 2.54లక్షల నీటిని దిగువనకు విడుదల వదులుతున్నారు. మరోవైపు తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 1,632.22 అడుగులకు గానూ 1,63 1.99 అడుగుల నీటిమట్టాన్ని నిర్వహిస్తూ ఇన్‌ఫ్లోగా వస్తున్న 98,392 క్యూసెక్కులను అంతేస్థాయిలో కిందికి పంపుతున్నారు. అలా రెండు ప్రాజెక్టుల నుంచి సాయంత్రం ఆరు గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టుకు 2.58లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. దాంతో వేగంగా నీటి మట్టం పెరుగుతున్నది. శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 861 అడుగులకు నీరు చేరింది. పూర్తి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 109.01 టీఎంసీల మేర నీరుంది. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 45వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దాంతో నాగార్జునసాగర్‌లోనూ నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల ద్వారా వస్తున్న నీటితో సాగర్‌లో 24 గంటల్లో 2.29టీఎంసీల నీరు వచ్చి చేరడంతో 1.40అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. శుక్రవారం సా యంత్రం ఆరు గంటల సమయానికి నాగార్జునసాగర్‌లో 505.50అడుగు ల నీటిమట్టంతో 124.16టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన వరదల ఉధృతి ఇలాగే కొనసాగితే మూడు, నాలుగు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు నిండి ఆ తర్వాత వరద నీరంతా సాగర్‌కే రానున్నది. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఈసారి సాగర్ ఆయకట్టులో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది ఎడమ కాల్వకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో రెండు పంటలకు నీరు అందించే అవకాశం ఉందని ఎన్ఎస్‌పీ అధికారులు కూడా చెబుతున్నారు.

సాగర్ డ్యామ్ భద్రతకు ఢోకా లేదు

కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడంతో నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరే అవకాశం ఉంది. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ కమిటీ సూచనల ప్రకారం డ్యామ్ పటిష్టతకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాం. డ్యామ్ క్రస్ట్ గేట్ల రబ్బర్ సీలింగ్, రోప్ వైర్ల మార్పిడి, గేట్లకు అమర్చిన మోటర్ల ఒరాయిలింగ్ మరమ్మతులు, ఆయిలింగ్, నిర్వహణ పనులను పూర్తి చేశాం. డ్యామ్ భద్రతకు ఢోకా లేదు. రానున్న వరదను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల మంచి ఫలితాలను ఇస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం పంటలకు నీటి విడుదల ఉంటుంది.

–డ్యామ్ సీఈ నాగేశ్వర్‌రావు

ఒకటిన ట్రిపుల్ ఆర్‌పై హైకోర్టులో విచారణ

- స్టే వెకేట్ కోసం అధికారుల పిటిషన్

యాదాద్రి భువనగిరి, జూలై 26 (నమస్తే తెలంగాణ) : రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)లో భాగంగా రాయగిరి రైతులకు సంబంధించి వచ్చే నెల ఒకటో తేదీన హైకోర్టులో విచారణ జరుగనుంది. ఇప్పటికే పలు సందర్భాల్లో తాము భూములు కోల్పోయామని, ట్రిపుల్ ఆర్‌లో భాగంగా మరోసారి తమ భూములు పోతున్నాయని కొంతమంది రైతులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దాంతో రాయగిరి రైతులకు అనుకూలంగా అప్పుడు కోర్టు స్టే విధించింది. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ ఇప్పటికే స్టే వెకేట్ కోసం పిటిషన్ దాఖలు చేసింది. భూ సేకరణలు పనులు వేగవంతం చేయాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో స్టే వెకేట్ కోసం ఈ నెల 25న జిల్లా అధికారులు మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వచ్చే నెల ఒకటో తేదీన విచారణ జరుగనుంది.

నల్లగొండ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

రాజకీయాలకతీతంగా నల్లగొండను తీర్చిదిద్దుతా

- అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఉండొద్దు
- నల్లగొండ మున్సిపల్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, జూలై 26 : అనేక వనరులతోపాటు హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న నల్లగొండను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఒక ప్రణాళిక ప్రకారంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత నల్లగొండే అనేలా చేస్తానన్నారు. శుక్రవారం నల్లగొండ మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ విలీన గ్రామాల కోసం ప్రత్యేక నిధులు సేకరించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఓఆర్ఆర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తామన్నారు. 565 జాతీయ రహదారి నిర్మాణంతో తనకు సంబంధం లేదని, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులే రూట్లు నిర్ణయించారని తెలిపారు. అయినా బాధితులుకు మార్కెట్ రేటుకు అనుగుణంగా నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణంలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారుకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ లేనంత మంది పారిశుధ్య కార్మికులు నల్లగొండలో ఉన్నారని, వీధుల్లో ఎక్కడ చెత్త కనపడొద్దని సూచించారు. నిర్మాణాలకు అనుమతులు, అసోసియేట్ల పేరుతో కలెక్షన్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, సక్కగ ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు.

పానగల్ పర్యాటకానికి వచ్చిన నిధులు దారి మళ్లించవద్దు

- బీఆర్ఎస్ కో ఆప్షన్ సభ్యుడు కొండూరు

నల్లగొండ పట్టణానికి ఆనుకున్న ఉన్న పానగల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన ఎస్‌డీఎఫ్ నిధులు రూ.130 కోట్లను దారి మళ్లిస్తూ తీర్మానం ప్రవేశపెట్టడాన్ని బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు వ్యతిరేకించారు. ఆ నిధులతో ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలను అభివృద్ధి చేయాలని, అవసరమైతే ప్రత్యేక నిధులు తేవాలని మంత్రిని కోరారు. పాతబస్తీ ప్రాంతంలో చాలా ఏండ్లుగా గ్రామ కంఠం భూముల్లో ఇండ్లు కట్టుకుని ఇంటి నెంబర్ తీసుకుని ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ అభిమన్యు శ్రీనివాస్ కోరగా, కలెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ పట్టణంలోని రోడ్ల దుస్థితిని వివరించే ఫొటోలతో బీజేపీ సభ్యులు పిల్లి రామరాజుయాదవ్, బండారు ప్రసాద్, గుర్రం జ్యోతి నిరసన తెలిపారు. సమావేశంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఈఈ రాములు, కౌన్సిలర్లు మారగోని గణేశ్, ఆలకుంట్ల రాజేశ్వరి, పర్వత్ ఫర్జానా, మాదగోని నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

అంతకుముందు నల్లగొండ మండలంలోని దొనకల్ గ్రామంలో రూ.3కోట్లతో నిర్మించనున్న 33\11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ట్రాన్స్‌కో సీజీఎం ఎం.భిక్షపతి మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో దొనకల్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అక్కడి నుంచి నల్లగొండ పట్టణ శివారులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనానికి మంత్రి చేరుకుని పనులను పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి మిగిలి ఉన్న పనులపై ఆరా తీసి, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, నల్లగొండ మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాంగెస్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవం

సైనికాధికారులను సన్మానిస్తున్న కళాశాల ఉపాధ్యాయులు

బీబీనగర్, జూలై 26 : సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బీబీనగర్ మండల పరిధిలోని తెలంగాణ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాలు నిర్వహించారు. జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర రావు అధ్యక్షతన ఏర్పాటైన ఈ కార్యక్రమంలో డైరెక్టర్, కెప్టెన్ రాఖీ హాన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైన్యంలో ఆమె అనుభవాలు పంచుకుంటూ కార్గిల్ యుద్ధంలో కొన్ని వందల మంది సైనికులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఆ సైనికుల కుటుంబాల్లోని పిల్లలు, మహిళలు, తల్లిదండ్రులు అంతటి దుఃఖంలో కూడా దేశభక్తితో వ్యవహరించారని తెలిపారు. తన సోదరులు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న విషయాలు ప్రస్తావిస్తూ కంటతడి పెట్టగా సభలో అందరూ భావోద్వేగం చెందారు. కళాశాల ప్రిన్సిపాల్ రామక పాండురంగశర్మ మాట్లాడుతూ సైనికుల అసమాన త్యాగాలతో మనం అంతా ప్రశాంతంగా ఉంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సైన్యంలో పని చేసి దేశ సేవలో పాల్గొన్న కెప్టెన్ రాఖీ హాన్‌తో పాటు హవల్దార్ రవి, రాము, ముస్తఫాలను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాలలో వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు దేశ భక్తిని చాటుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఉనారు.

ఎక్సైజ్ విభాగానికి రూ.7,147 కోట్లు పెంచి

ప్రజలను తాగుబోతులను చేస్తారా..?

- మద్యం దుకాణాలను తగ్గిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి గల్లీకో బెల్ట్ షాపులను పెడుతారా..?
- బడ్జెట్‌లో యాదగిరి గుట్ట దేవస్థానానికి నయాపైసా కేటాయింపు లేదు
- గంధమల్ల, తపాసుపల్లి రిజర్వాయర్ల ఊసేలేదు
- ఆరు గ్యారెంటీల పరిస్థితేంది
- మీడియా సమావేశంలో టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూలై 26 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఎక్సైజ్ శాఖకు రూ. 18,470 కోట్లు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సారి రూ.25,617 కోట్లు కేటాయించిందని, గతంతో పోలిస్తే రూ. 7,147 కోట్లు పెంచి ప్రజలను తాగుబోతులను చేస్తారా..? అని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బెల్ట్ షాపులు బంద్ చేయిస్తామని, మద్యం దుకాణాలను తగ్గిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి గల్లీకో బెల్ట్ షాపులను పెడుతారా..? ప్రశ్నించారు. యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ఏ వర్గానికీ మేలు చేసే విధంగా లేదన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం పంపిణి చేసి ప్రజలకు తాగుబోతులను చేసే పనిలో కాంగ్రెస్ ఉందని ధ్వజమెత్తారు. గంధమల్ల జలాశయాన్ని నిర్మిస్తామని, తపాసుపల్లి జలాశయం ద్వారా ఆలేరు నియోజకవర్గానికి సాగునీళ్లందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గ ప్రజలకు ఇప్పుడేం సమాధానం చెబుతారో వివరించాలని తెలిపారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ నృసింహసాగర్ జలాశయం నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి 95 శాతం పనులను పూర్తి చేశారన్నారు. కానీ బడ్జెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నృసింహసాగర్, గంధమల్ల, తపాసుపల్లి జలాశయాల ఊసెత్తలేదని మండిపడ్డారు. కేవలం అంకెల గారడి తప్పితే ప్రజలకు లాభం లేదని ఆరోపించారు. సస్యశ్యామలంగా మారబోయే జిల్లాను ఏడారిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదని చెప్పారు. రైతు భరోసా, కౌలు రైతులు, కూలీలు, మహిళలకు ఆర్థిక సాయం, ఆసరా పింఛన్ రూ. 2 వేల నుంచి రూ. 4 వేల పెంపు వంటి పథకాలను మరిచారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ రూ. 1200 కోట్ల ప్రభుత్వ ఖజానాతో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని అద్భుతంగా పునర్నిర్మించారని చెప్పారు. 99 శాతం పనులు పూర్తికాగా ఒక శాతం పనులు మిగిలి ఉన్నాయన్నారు. కానీ బడ్జెట్‌లో యాదగిరిగుట్ట దేవస్థానానికి ఒక్క రూపాయి కూడా కేటాయించక తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్లలో రూ.50 వేల కోట్లు అప్పుజేశారని ఆరోపిస్తున్న రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కారు మాత్రం కేవలం 7 నెలల్లోనే రూ.34 వేల కోట్ల అప్పు తెచ్చిన్నట్లు చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాలో ఏమొహం పెట్టుకుని తిరుగుతారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు, రైతులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, జిల్లా నాయకులు వంటేరు సురేశ్‌రెడ్డి, పట్టణ నాయకుడు గంజి సూర్యనారాయణ నేత పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం అవసరమైన నిధుల కేటాయింపు జరుగలేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం సీపీఎం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. విభజన హామీలో ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, యూనివర్సిటీ ఏర్పాటు, మూసీ నది ప్రక్షాళన, ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలను తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసమే ఏపీకీ రూ.15వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు డబ్బికార్ మల్లేశ్, వెంకటేశ్వర్లు, పాండు, అంజద్, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, అప్పారావు, ఏసు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నమస్తే తెలంగాణ
పదవీవిరమణ శుభాకాంక్షల ప్రకటనలు
మీ బంధువులు, స్నేహితులు, మీ శ్రేయోభిలాషులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా..?
అయితే మీ శుభాకాంక్షల శుభాకాంక్షలను నమస్తే తెలంగాణ ద్వారా ఒక తీపి గుర్తుగా అందించండి... ఆనందించండి...
ప్రకటనలకై సంప్రదించండి...
25% DISCOUNT
5% GST EXTRA
సెల్: 9182777625
నల్లగొండ: 9182777635
సూర్యాపేట: 9182777630
మిర్యాలగూడ: 9182777059
భువనగిరి: 9182777638
కోదాడ: 9182777059
హుజూర్‌నగర్: 9182777059
దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
చౌటుప్పల్: 9182